శ్రావణ మంగళవారం

శ్రీ అయ్యగారి విశ్వేశ్వర రావు

(గతసంచిక తరువాయి)

ఈ గొడవలో గడియారం పదకొండున్నర కొట్టింది. అప్పుడు ఆవిడ అందుకుంది. ఇంకేం వెడతారు యివాళ. నామాట విని ఏదో కారణం వ్రాసేయండి. ఎందుకలా జంకుతారు. శలవుపెట్టే వాళ్ళంతా సత్యహరిశ్చంద్రులంటారా! అంది హేళనతో, ఊరికే చెప్పాడా! మహనీయుడు దేవగో! 'స్త్రీ బుద్ధి ప్రళయాంతకః' అని.

తప్పనిసరిగా శలవుచీటీ వ్రాశాను — అపారమైన దగ్గు — పడిశం - జ్వరం హఠాత్తుగా వచ్చిందనీ - ఆఫీసుకు రాలేనని — శలవు ఒకరోజుకు మంజూరు చేయవలసిందనీ. భక్తిశ్రద్ధలతో మా ఆవిడ — ప్రక్కయింటి అబ్బాయిద్వారా ఆ శలవుచీటీని మా ఆఫీసుకు రవాణా చేసింది. భోజనాలయ్యాయి. కొంచెం విశ్రమించాను. కొంప మునిగిపోయినట్టు ఆవిడ లేపింది. ఆఫీసులో అయితే యిలా పడుకుంటారా? అన్నట్టు! శలవుపెట్టి ఆఫీసులోవుంటే రికార్డురూములో రెస్టు కాకపోతే వేస్టు చేస్తానా ఖరీదుగల శలవుని అన్నాను. గడియారం చూడగా రెండయింది. అప్పుడే మా శ్రీమతి కొత్తపెళ్ళికూతురులాగ ముస్తాబయింది. పేరంటాల హడావిడి ఆవిడలో అప్పుడే ఆరంభమయింది. నాకన్న ముందే - ఇది ఏడాదికోసారి వచ్చే సరదా కాదుటండీ అంది.

ఇదిగో యిలా చూడండి — ఉయ్యాలలో బాబ్జి పడుకున్నాడు. వాడిప్పుడు లేవడు. ఏ నాలుగింటికో లేస్తాడు, లేచినప్పుడు ఆ ఫ్లాస్కులో వేన్నీళ్ళు వున్నాయి. అదిగో గ్లాస్కో డబ్బా. విసుక్కోకుండా పాలుకలిపి వాడికి పట్టించండి. మీరే అన్నారుగా! 'ఎవరి పిల్లలు వాళ్ళకి బరువా?' అని అంది. ఒకప్పుడు మనమాటలు మనకే యెదురుతిరిగి బెదిరిస్తాయి కదూ!

ఓహో! యిదంతా ఛార్జిలిస్టు అన్నమాట. సరి — మొదటిది చంటికుర్రాడికి పాలిచ్చి - ఏడవకుండా చూడటం. యిహ రెండోది ఏవిటో చెప్పు చప్పున — అన్నాను యింకేం పురమాయిస్తుందోనని —

ఏమీ లేదండి - మూడుగంటలకి అప్పలమ్మ వస్తుంది. ఆ మూలవున్న అంట్లు దానికే వేసేయండి. ఈలోపుగానే మీరు — మీ కాఫీ ఆ కుంపటిమీద కాచుకొని, ఆ కాఫీగ్లాసులు కూడా దానికి వేసేయండి. అన్నీ జాగ్రత్తగా లెక్కపెట్టుకొని యింట్లో పెట్టించండి. దాని దగ్గఱవుండి యిల్లంతా వూడిపించండి. దాసీవాళ్ళని వెయ్యి కళ్ళతో చూస్తూండాలి. నేను లేనుకదా అని, అవి పెట్టండి! యివి పెట్టండి! అని అడుగుతారు దండుముండలు. మెతకపడి యిచ్చారుకనక అని యింకా చెప్పింది.

బావుంది. ఇంత బ్రతుకూ బ్రతికి యింటి వెనకాతల చచ్చాడన్నట్టు యీ వెట్టిచాకిరీకూడా నేను చెయ్యాలన్నమాట — ప్రత్యేకంగా శలవుపెట్టి! అన్నాను - దిగాలుగా!

మీ దగ్గఱవున్న బలహీనత అదే! అన్నింటికీ ముందర డీలాపడతారే! మనపని మనం చేసుకోవడం వెట్టిచాకిరీ ఎన్నటికీ కాదు — అంది ఆవిడ.

అది సరేకాని — యింకేం చెయ్యాలంటావ్ యివాళ అన్నాను. పెద్దాడు రాంబాబు - నేను వెళ్ళానని ఏడుస్తాడు స్కూలునుంచివచ్చి. వాడిని యింకా ఏడిపించక - ఏదైనా కొనిపెట్టండి. సుధీర్ నిద్రపోతున్నాడు. వాడు లేవగానే ఏడుస్తాడు. అదుగో ఆ అలమార్లో బిస్కట్లున్నాయి. వాడికి అవిపెట్టి వూరుకోపెట్టండి. మంజుల - ఆడపిల్ల! దానికి పేరంటం సరదావుంది. వస్తానంటుంది. దాన్ని నేనుకూడా తీసుకువెడుతున్నాను. తలుపులు బార్లా తీసుకొని గుర్రెట్టి నిద్రపోకండి - పట్టపగలే దొంగతనాలు - దోపిడీలు చేస్తున్నారట. ఊరేమీ బాగాలేదు - ఇలాగ ఎన్నో సలహాలిచ్చి — యిల్లు జాగ్రత్త అంటూ హెచ్చరించి, చకచరా స్నేహితురాండ్రతో శ్రీమతి పేరంటానికి పోయింది.

మనలాగే యీ శ్రావణమంగళవారంనాడు మన ప్రక్కవాటాలలో ఎవళ్ళైనా శలవుపెట్టి సంసారానికి పహరా పడుతున్నారా! అని చూదామనిపిం

చింది. ఆ వాటాలపై ఒక చిన్న ట్రిప్పుకొట్టి యిట్టే యింట్లోకి వచ్చాను. అప్పటికప్పుడే అంత నిద్రా మానేసి — ఆ సుధీర్ ఓ కేక పలవిపట్టాడు, వూరుకోరా - బాబూ - వూరుకో! అన్నాను. వూరుకుంటే గదా వాడు. వూరుకోమన్నకొద్దీ ఏడుస్తున్నాడు. అమ్మ ఏది? అంటాడు - ఆ ఏడుపులోనే! వస్తుంది నాన్నా — అలా పేరంటానికి వెళ్లింది — అమ్మ. నీకు యింనకాపప్పులు తెచ్చిపెడుతుంది — మిఠాయికూడా తెస్తుంది. దర్జాగా తిందువుగాని, వూరుకోవూ! అని ఎంతో చెప్పాను. నాకేమి వద్దు. ఇప్పుడు అమ్మ కావాలి. చూపిస్తావా లేదా? అని ఆరంభించాడు. హెచ్చుస్థాయిలో ముఖారిరాగం. దానికితోడు భరతనాట్యం. ఈ అల్లరికి ఆ చంటి పిల్లాడు ఉయ్యాలలో — యిట్టే ఉలిక్కిపడుతున్నాడు. వీడి ఏడుపు చల్లగావుంటూ — మానడు కదా, ఇది పనికాదని మా ఆవిడ చెప్పినమంత్రం వుందిగా. అలమారలోంచి — నాలుగుబిస్కట్లు తీసి వాడిచేతిలో పెట్టాను. యింకా కావాలన్నాడు. మరి లేవురా బాబూ అన్నాను. నామాట నమ్మక - ఆ బిస్కట్లడబ్బా అంతా యిమ్మన్నాడు. ఇవ్వనంటే మళ్లీ ఏడుపు. వాడు యిలా ఏడిస్తే — ఆ వుయ్యాలలో కుర్రాడుకూడా లేస్తాడేమోనని నాభయం. అంచేత — సుధీర్ముందర ఆ బిస్కట్లడబ్బా పడేశాను. పిల్లకాండోలాగ ఆ కుర్రకుంక అన్ని బిస్కట్లు అయిదు నిమిషాల్లో తినేసి మళ్లీ ఏడుపు లంకించుకున్నాడు. బిస్కట్లు తిన్న బలంతో బహుపసందుగా మొదలెట్టాడు ముఖారి ఆలాపన. అలా కూర్చున్నావేం — లే - అమ్మదగ్గరకు తీసుకుపో — అమ్మ కావాలి! అమ్మ కావాలి! అని ప్రారంభించాడు పోరు. ఎంతవరకూ శాంతంగా వుండగలను చెప్పండి. కళ్లెఱ్ఱచేసి - నోరుమూస్తావా - లేదా? అని బెదిరించాను వాడిని. ఈమాత్ర యేమీ పనిచేయలేదు, సరిగదా పరిస్థితులు యింకా విషమించాయి. పెద్దగొంతుకతో అమ్మా - అమ్మా అని ఏడుపు ఆరంభించాడు వాడు. వాడి సముద్రంహోరు వంటి ఆ కంబుకంఠం ఏడుపుతో ఉయ్యాలలో తియ్యగా నిద్రపోతూన్న కుర్రాడుకూడా లేచాడు. లేవడమేమిటి - ఆ ఏడిచే అన్నగారిని చూడటమేమిటి - అన్నగారి ముఖారి గానకచేరీకి వంతపాట లంకించుకున్నాడు. వూరుకోరా! అని సుధీర్కి వుయ్యాలవూపుతూ చిన్నవాడినీ సముదాయించాను. ఎవరిమీదా - నా ప్రయోగం ఫలించలేదు. ఇద్దరి ఏడుపూ యింట్లో ఎంతో సందడిగావుంది. ఇంతలోనే గడియారం కంగుకంగున మూడు కొట్టింది. ఒకగంట ముందుగా లేచాడు చంటివాడు. ఆ సుధీర్ అలా ఏడవకపోతే యింకా కాస్సేపు పడుకునేవాడే పాపం. వాళ్ల అమ్మ నాలుగు గంటలకుకాని - పాలు పోయవద్దంది. వీడి ఏడుపు మానిపించే సాధనం తోచలేదు. యింక - సుధీర్ ఆరోస్థాయిలో పాడుతున్నాడు ముఖారిపాట. ఇంతలోనే బెలూన్ సాయిబు యిన్ని రంగురంగుల బెలూన్లు మోసుకొనిపోతున్నాడు కిర్రుకిర్రు చప్పుడు చేసుకుంటూ. ఆ బెలూన్ సాయిబును చూడగానే సుధీర్ ఏడుపును తగ్గించుకున్నాడు. అది కొనిపెట్టమన్నాడు. పోనీలే - యిది నయమేనని ఆ బెలూన్ సాయిబును పిలిచి వాడికినచ్చిన రంగుగల పెద్ద బెలూన్ను కొనిపెట్టాను. ఆ బెలూన్ను చేతిలో పెట్టుకొని కాస్సేపు — ఎగరేసి కాస్సేపు సుధీర్ ఆనందిస్తున్నాడు. ఫరవాలేదు - వీడిపోరు శాంతించింది అనుకున్నా. కాని చంటికుర్రవాడు కలత నిద్రలోంచి కంగారుగా లేచాడేమో — వుయ్యాలా వూపినా వూరుకోవటంలేదు. వచ్చీరాని సినిమా పాటల్ని వినిపిస్తేస్తున్నా - పాటలకు పసిపాపలు లొంగుతారని! కాని మా చంటికుర్రాడు నాపాటను వినకుండానే యేడుస్తున్నాడు. ఇది పనికాదని ఎత్తుకొని అటూయిటూ తిప్పుతూ మళ్లీ సినిమాపాటలు పాడుతున్నాను. ఈమాటు కొంచంసేపు వూరుకున్నాడుకాని మళ్లీ ప్రారంభించాడు పాతపోరు. ఇంతట్లోనే అప్పలమ్మ చక్కావచ్చింది. మా ఆవిడచెప్పిన సలహాల ననుసరించి దానికి అంట్లువేశాను. ఈలోపుగా మా సుధీర్గాడు ఆ బెలూన్ను ఏంచేశాడో మరి - పెద్దచప్పుడుచేసి అదికాస్తా భళ్లునబ్రద్దలయింది. కొంచం వూరుకున్న చంటికుర్రాడు ఆ చప్పుడికి వులిక్కిపడి పెద్దపెట్టున ఏడుపు ఆరంభించాడు. ఆ బెలూన్ పోయిందీ - పోయింది! అంటూ చెక్కభజన పోజులో సుధీర్ మళ్లీ ఏడుపు ఆరంభించాడు. వూరుకోరా! నాయనా! యింకో బెలూన్ కొనిపెడతానులే! అన్నాను. అబ్బే! ఆ బ్రద్దలయిన బెలూన్ మళ్లీ యథాప్రకారంగా తీసుకువస్తావా - చస్తావా అంటాడు. బద్దలయిన బెలూన్ అతుక్కుదురా! కొత్తది కొనుక్కోవాలి - అని నచ్చచెప్పితే- నా వాదం వాడికేమీ అర్థంకాలేదు. వాడి ఏడుపును మాన్పించడం యింక నాతరంకాదనిపించింది. పాపం - చంటికుర్రాడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు. అప్పుడే నాలుగు దాటింది. ఇంక పాలుపోస్తే

మంచిది _ అనుకుంటూ ఫ్లాస్కులో నీళ్లు గ్లాసులో పోసి - గ్లాసెడు పొడుం వేసి - బాగా కలిపి _ కొమ్ము చెంబులో పట్టిస్తున్నాను. ఆ చంటిపిల్లవాడికి ఎంతగుర్తో. నాముఖంవైపూ _ ఆ పాలచెంబువైపూ చూడటం, ఏడవటం. అలవాటుగా పాలుపట్టించే అమ్మ యేమయిందో అని అడగటమే ఆ ఏడుపు అర్థం కామోసు. లాలించి - జోలపాట పాడుతూ పట్టించినా _ ఆ పాలు తాగటంలేదు వాడు. తండ్రి కలిపినపాలకీ _ తల్లి కలిపినపాలకీ తేడా వుంటుందా! పాలు తాగడు. ఏడుపు మానడు. వాడి ఏడుపుతో సుధీర్ ఏడుపు. ఛఛా! ఎంత నరకబాధ! వీళ్లిద్దరూ యిలా పెద్దపెట్టున ఏడుస్తూండగానే - ఒక దండు కుక్క ఎలావచ్చిందో మరి _ ఆ వంటింట్లో ప్రవేశించింది. కాఫీ కాచుకుందామని అక్కడ వుంచిన పాలు కాసినీ తాగేసింది. అంతటితో వూరుకుంది కనకనా, పాపం - మా ఆవిడ బుద్ధిమంతురాలై రాత్రికికూడా వండిన వంటకాలన్నీ నిర్భయంగా మూతితో ముట్టుకొని బాగా రుచిచూసి - నచ్చినవి తిని - యిల్లంతా మెతుకుల మయంచేసి _ నీయింటి కాపలా యింతేనా? అన్నట్టు ఒక అన్నంకరుడు నోటిలో వుంచుకొని వంటింటిగుమ్మంలోంచి తొంగి చూస్తోంది. నాకు పట్టరానికోపం వచ్చింది. అందుబాటులోవున్న అప్పడాలకర్ర తీసుకొని దాన్ని కొట్టాలనే వుద్దేశంతో బలంగా విసిరాను. జంతువులకికూడా ఆపదలనుంచి రక్షించుకొనే తెలివి వుంటుందిగా - ఆ అప్పడాలకర్ర ఘాటీని తప్పించుకుని - ఆ కుక్క సర్గా నేనున్నగదిలోకి పరుగెత్తుకువచ్చి - బాబ్జీగాడి పాలగిన్నెను బోర్లగించింది. అన్నిపాలూ వొలికిపోయాయి. అంతటితో వూరుకుందా, దాని పక్కనేవున్న ఆ ఫ్లాస్కునుకూడా తన్ని మరీ పోయింది. అంతఖరీదయిన ఫ్లాస్కు క్రిందపడింది. అయ్యో! అని ఆ ఫ్లాస్కును తీసి చూసేసరికి ఏముంది- లోపలి వేడినీళ్లబుడ్డి చితికిపోయింది! ఏమనుకోవాలి. ఇలా తిరుగుతూన్న ఆ కుక్కని ఏంచేసినా పాపం లేదనుకొన్నాను. ఒక సర్వేపేముతీసి సాగదీసి విసిరాను ఆ కుక్కమీదవున్న కోపంకొద్దీ. ఆ తెలివిగల కుక్క ఆ దెబ్బను తప్పించుకుంది కాని _ ఆ సర్వేకర్ర దెబ్బ నూటిగాపోయి అంట్లుతోమి యింట్లోకి తెస్తూన్న అప్పలమ్మకి చచ్చేటట్టు తగిలింది. చంపినావు బాబూ - అంటూ అప్పలమ్మ గోలచేసింది. అయ్యో! నీకు తగిలిందటే ఆదెబ్బ! అని దాని కాలుపట్టుకొని ఫస్టుఎయిడుచేసి - ప్రమాదమైనదెబ్బ కాదని ధైర్యంచెప్పి - యిల్లు వూడవక్కర్లేదులే యివాళిటికి అని దానికి ఆపని తగ్గించి _ యింటికి పొమ్మన్నాను. కుంటుతూ - కుంటుతూ అది నన్ను శపించిందేమో! నాకు వినిపించలేదు మరి - యింటికి పోతూంది!

వెనకటికి ఓపద్యం వుంది "గురువులరాక _ దాసి స్మృతి _ గుఱ్ఱపుదాడియు అల్లుడల్కయున్, వరసతి గర్భవేదన వివాహము కొత్తులజల్లు కాత్రియున్"... అంటూ యింకా. ఈ వరస యివాళ మాయింట్లో ప్రతిబింబించిందిగా _ అనుకున్నాను.

చిన్నవాడు ఏడిచి ఏడిచి - అలిసిపోయి ఆఖరికి నిద్రపోయాడు. బెలూన్ పేచీ పెట్టిపెట్టి _ ఓపిక వున్నంతసేపూ ఏడిచి - ఆ కుక్క చేసిన అల్లరిసందడిలో ఏడుపు మరిచిపోయాడు సుధీర్, ఇల్లు కొంచం శాంతించింది. పెద్దవాన హోరుతగ్గినట్లుంది - అనుకుంటూండగానే - పెద్దాడు రాంబాబు వచ్చాడు స్కూలునుంచి, వస్తూనే - వాడు, అమ్మేది నాన్నా అన్నాడు. అబద్ధం చెప్పాలని లేక - వున్నసంగతి రాంబాబుతో చెప్పాను. చెప్పిందే తడవుగా _ లేని ఏడుపు తెచ్చుకొని - నన్ను తీసుకొని వెడతానని చెప్పిందీ _ చెప్పిందీ అంటూ అరంభించాడు ఏడుపు. మగాళ్లు పేరంటానికి వెళ్లకూడదు నాన్నా. నువ్వు ఆడదానివా? చెప్పు. ఇదిగో యీ అణా తీసుకొని ఆ మిఠాయికొట్లో ఏమయినా కొనుక్కో అన్నాను. ఏమనుకొన్నాడో మరి - ఏమీ గొడవచేయకుండానే వాడు ఆ అణా పుచ్చుకొని చక్కాపోయాడు. ఫరవాలేదు _ మనవాడు బుద్ధిమంతుడే - అనుకున్నాను. వీధిలో _ ఇంతట్లోనే రిక్షావచ్చి ఆగింది. గడియారంవైపు చూస్తే అయిదున్నర అయింది. ఎవరు చెప్మా దిగింది యీరిక్షాలో - అని చూస్తినిగదా! ఎవరింకే _ మా ఆవిడే. ముఖం నిరుత్సాహంగా వుంది. ఆపిల్ల మంజుల తలకి అద్దేమిటి ఆ కట్టు! నెత్తురుమరకలు కూడాను. నాకు చాలా కంగారు పుట్టింది. ఇంట్లోకి వచ్చింది ఆవిడ. మంజులని మంచంమీద పడుకోబెట్టింది. సుధీర్ వైపు చూసింది. కన్నీళ్లు ఎండిపోయి బుగ్గలమీద చారలుపడ్డాయి, సొమ్మసిల్లినట్టు ఆ నిద్రపోయే కొడుకుని ముద్దెట్టుకొని - అంత ఏడిపించారా సుధీర్‌ని అంది నామీద మొదటినేరం మోపుతూ, అరే _ ఫ్లాస్కు అలాపడిపోయిందేఁడీ బ్రద్దలయిందా? ఏం మనుష్యులం - పెద్దసిరవాకం, చేశారు అంది కోపంతో - రెండోనేరం మోపుతూ

అయితే — అన్నిబిస్కట్లు ఒక్కనాడే పెట్టుకుంటారా ఎవళ్ళయినా, అంటూ మూతిని మూలమూలలకీ మడిచింది. ఇల్లంతా యిలావుందేం - ఆ అప్పలమ్మ యిల్లు వూడవకుండానే పోయిందా. వూడిపించమని చెప్పావుగా — ఎందుకంట దానిమీద మీకంతకనికరం ? అంటూ యింకోనేరం మోపుతూ - వంటింట్లోకి వెళ్ళింది. ఆడది లేనికొంప ఎలావుంటుందో ఇప్పుడర్థమయిందా మీకు ? ఏమిటండీ యిదంతా ? అని ఆ కుక్క చేసిన గొడవని - ముక్కుమీద వేలెట్టుకొని చూసింది. అయితే రాంబాబు స్కూలునుంచి రాలేదా ? అని అడిగింది. వచ్చాడు. అమ్మ ఏది ? అని తెగఏడిచాడు. ఎంతచెప్పినా వూరుకోలేదు. వాడికి ఒకఅణాయిచ్చి మిఠాయి కొనుక్కోరా అన్నాను. అది పుచ్చుకొని వెళ్ళిపోయాడు యింకా రాలేదు. చాలా సేపయింది. ఎవళ్ళతోనో ఆడుకుంటూ వుంటాడు - అన్నాను.

చాల్లెండి. కుర్రాణ్ణి అలావదిలేసి - ఎంతసేపటికీ రాకపోయినా చీమయినా కుట్టదే మీకు. చూసిరండి - అని సణుక్కుంది. అంతటితో వూరుకుందా, ఏ మగాళ్ళయినా చూడముచ్చటేస్తుంది. యిల్లంతా యించక్కా చక్కపెట్టుకుంటారు. నేను చేసుకున్న పుణ్యం యిలా బద్దలయింది. ఎందుకూ ఆశలేదు. అని విసుక్కుంటూ — నా మూలంగా వచ్చిన నష్టకష్టాల్ని మాటమాటకీ సాగదీస్తూ వంటింట్లోకి పోయింది ఆవిడ. మాటలు ఫెటీల్ ఫెటీల్మనే ధాటీతో మారుమ్రోగుతున్నయి.

ప్రాణం ఒప్పక - మంచంమీద పడుకున్న అమ్మాయి మంజుల దగ్గరకుపోయి - ఎందుకమ్మా — అలా కట్టు కట్టుకున్నావు తలకి - అన్నాను. ఆ వెర్రిపిల్ల కళ్ళనీళ్ళు తెచ్చుకొని - సైకిలుకింద పడ్డాను - అంది. అయ్యో వెర్రితల్లీ - సైకిలుకింద పడ్డావుటే - అని ఓదారుస్తున్నాను. శ్రావణమంగళవారం ఎంత పని చేసింది ? అనుకుంటూండగానే ఆవిడ గొంతెత్తింది.

వెళ్ళి — కుర్రాణ్ణి వెతకండి — తరవాత మాట్లాడుకుందాం మిగతా విషయాలు — అని ఒక పెద్దకేక వేసింది ఆవిడ. తనకే పుత్రప్రేమ వున్నటూ - నాలో లేనట్టూ !

వాదించి ఏంలాభం, గొడవా - గొడవా పెరిగి కొండంత కావడం. నలుగురూ వినడం - నానారకాలుగా అనుకోవడం. ఆ పద్ధతి సుజనపద్ధతి కాదని చెప్పిన ఏనుగు లక్ష్మణకవిని తలుచుకొని - గడప దాటి — గేటుదాటి రోడ్డుమీద వచ్చేపోయేవాళ్ళను చూస్తూ మిఠాయికొట్టు దగ్గరకుపోయి - సెట్జీ మా వాడు వచ్చాడా ? అన్నాను. వచ్చాడు సార్. మిఠాయికొని గోదావరి ఒడ్డువైపు పోయారండీ — వాళ్ళ అమ్మదగ్గరకు పోతానంటూ అన్నాడు ఆసెట్టి. నాగుండెలు లట్ లట్ మన్నాయి. గోదావరి ఒడ్డుకు పోయాను. గోదావరితల్లి జోరుగా ప్రవహిస్తోంది. డబ్బాగొట్టం చేతినాపలతో పిల్లవీరులలాగ సాహసంగా పోతున్నారు కొంతమంది — ఉప్పొంగే ఆ గోదావరి ప్రవాహం వెంబడి, పెద్దచెట్లు - చిన్నచెట్లు తెగకొట్టుకు వస్తున్నాయి. ఆ గౌతమికి కైమోడ్పులర్పిస్తూ — కోటిలింగేశ్వరస్వామిని సేవిస్తూ — కుంకుమ - పసుపుపొట్లాలు గిరవాటేస్తున్నారు కొంతమంది ఆడాళ్ళు. అంతా గుంపులు గుంపులుగా వున్నారు. ఈ గుంపుల్లో వున్నాడేమో రాంబాబు అని గుంపులన్నీ వెతుకుతున్నాను - అంతులేని ఆతురతతో. ఇక్కడే - పిడుగులాగ కనబడ్డాడు మా ఆఫీసు దఫేదారు జగ్గయ్య. కనిపించి వూరుకున్నాడా, దగ్గూ రొంపా-జ్వరంట కదా సార్-గోదావరి గాలిలో తిరుగుతున్నారే ? అన్నాడు. అప్పుడే అనుకున్నాను తప్పుడు కారణాలతో శెలవుపెట్టినట్టు వీడు నన్ను టముటమా చేస్తాడా యేమిటి ? అని దిగాలుపడుతూ - ఏంచెప్పను — జగ్గయ్యా, అవన్నీ వున్నాయి, చూడు. ఎలా దగ్గుతున్నానో అని కాంపిలుదగ్గు చూపించాను - బలవంతంగా : ఒళ్ళు చూడు — ఎలా వేడిగావుందో ! అన్నాను. రొంప ముక్కులో లేదు — అయినా, రొంపభారం కాస్త నయం జగ్గయ్యా అని నేనంటూంటే — గాలి మంచిది కాదు, గాలిలో తిరగకండి బాబయ్యా అన్నాడు జగ్గయ్య. మా పెద్దాడు రాంబాబుని ఎరుగుదువుగా — వాడు కనిపించటంలేదయ్యా, వాడికోసం వెతుకుతూ వచ్చాను - యిన్నిబాధలతోటీ అన్నాను. అలాగటండీ చెప్పరేం అని జగ్గయ్యకూడా నాతోపాటు వెతకడం ఆరంభించాడు. ఎంత వెతికినా రాంబాబు కనిపించలేదు.

ఇంటికి యీపాటికి వచ్చాడేమో - కనుక్కుందాం అని జగ్గయ్యా - నేను యింటికి వచ్చాం. మా ఆవిడ దిక్కుమొహం పెట్టింది. ఇలుగూ-పొలుగూ వాళ్ళు ఎలా పసికట్టారో రాంబాబు రాలేదని - బుద్ధిగల కుర్రవాడమ్మా అని కొందరూ — ఇంతసేపూ ఎక్కడ వున్నాడోనని కొందరు - వస్తాడు - తప్పక వస్తాడని

కొందరు వ్యాఖ్యానిస్తూ - ఓదారుస్తున్నారు. రాలేదా - అని నేనూ జగ్గయ్యా అడిగేసరికి _ రాలేదండీ అని బేరుమంది మా శ్రీమతి. పోనీ - పోలీసు స్టేషనులో కంప్లైయింటు యివ్వకూడదా? అని ఒకరు సలహా యిచ్చారు. ఔను _ అదీ మంచిదే అనుకున్నాను. చప్పున పోలీసు స్టేషనుకు పోవాలి అని తీర్మానించుకున్నాను. ఇంతట్లోకే మా యింటిప్రక్క వెంకమ్మగారువచ్చి - ఎవరో ఏడేళ్ల కుర్రాడు గోదావరిలో పడిపోయాడుట. జనం విరగబడిచూస్తున్నారు అంది. ఆమాట విని మా ఆవిడ బేరుమని పెద్ద ఏడుపు ఏడుస్తూ _ రాంబాబూ _ నాయనా! అంది. నీ మొహంలా వుంది, ఎవడో గోదావరిలో పడితే _ వాడికీ - రాంబాబుకీ సంబంధం యేంవుంటదే పిచ్చిదానా! అని నేను సముదాయించాను. జవాను జగ్గయ్యకూడా అలాంటి ప్రమాదం దేవునిదయవల్లరాకూడదు_రాదు అని జోస్యంచెప్పాడు. చల్లనిమాటలు, పుత్రశోకాన్ని చల్లారుస్తాయా. గర్భశోకంలోవుండే లోతు కన్నతల్లికే తెలియాలి. మా ఆవిడ యింతబెంబేలు పడినా _ నేను మాత్రం చెక్కు చెదరకుండా శాంతంగానేవున్నాను. నేనంతదీమాగావుండటం - మొండితనం అంటుంది మా ఆవిడ. లేవండి-పోయివెతకుదాం రాంబాబుని అంటూ తానూ లేచింది. ఇంట్లోకి పోయింది. అన్నితలుపులూ బిడాయించింది. నిద్రపోతూన్న సుధీర్ నిలేపింది. ఆ మంజులనికూడా తనతోరమ్మంది. ఉయ్యాలలోంచి బిడ్డని తీసి ఎత్తుకుంది. పెద్దతాళంకప్ప నా చేతిలో పెట్టి తాళం వేయమంది. ఆవిడతొందరకు తట్టుకోలేక తాళం బిగించాను. నడవండిచూస్తారేం అంది. జగ్గయ్యకూడ వస్తానన్నాడు పాపం. ఎంతజాలిగలవాడో. ఆవిడ _ నేనూ _ జగ్గయ్యా పిల్లల్ని ఎత్తుకోవడంలో - పంచుకున్నాం. ఎంతపనిజరిగింది? అని అందరూ జాలిపడ్డారు. సత్యనారాయణస్వామిని తలుచుకో తల్లీ. కుర్రాడుకనిపిస్తే ప్రతి ఆదివారం నీకు కొబ్బరికాయకొడతాను మహానుభావా - అని మొక్కుకొన్నారు. ఏడుకొండలవాడా! ఆపదమొక్కులవాడా! అని వెంకటేశ్వరస్వామికి దణ్ణంపెట్టుకొన్నారు. కొండకివస్తాం _ అడుగడుగులదణ్ణాలవాడా! అని మీదు కట్టమన్నారు. ఆకొడుకిమీద వున్న ప్రేమకొద్దీ - అందరు చెప్పినమాటలూ ఆలకించి - భక్తిశ్రద్ధలతో ఆదేవుళ్ళందరికీ అలాగే వాగ్దానంచేసింది. ఆపద _ భక్తినీ _ దేవతలనీ ఎక్కువజ్ఞాపకం చేస్తూంటాయికదూ. ఇన్నీచేసి_ శకునం చూస్తూంది ఆవిడ. వెఱ్ఱివెధవ _ యింతసేపు యెక్కడికైనా పోయివున్నాడా! యీపాటికి అన్నం _ అన్నం అంటూ కొంగుపట్టుకొని గొడవ చేశేవాడు. ఎక్కడున్నావ్ _ రాంబాబూ ఏం చేస్తున్నావు నాయనా! దీర్ఘరాగంతీసింది. నీకుమతి వుందా _ లేదా అని కసిరాను. ఆవిడ _ ఏడుపు మాని - నావైపుచూసి, అలా ఆలాకించండి _ మన తలుపులుకదూ చప్పుడవుతా, ఎవరో? అమ్మా! అని పిలుస్తూన్నట్లులేదూ! నిదానంగా వినండి - అంది. ఆమాటలువిని జగ్గయ్యకూడా కళ్ళనీళ్ళుతెచ్చుకొని గాబరాపడ్డాడు. తల్లి తన బిడ్డకోసం ఎంత తల్లడిల్లుతుందోచూడండి. తల్లికన్న దేవతలేదన్నారు. అంచేతనే అమృతం అమ్మగుండెలోనే వుంటుంది. అందువల్లనే స్వగ్రామం _ కన్నతల్లితో సమానమై స్వర్గాన్నికూడా నిలిచిగెలుస్తుందన్నారు _ అంటూ ప్రక్కయింటి తెలుగు మేష్టారు - మా సీనుచూసి వర్ణించారు. మళ్ళీఅంది - ఆవిడ! నిజంగా తలుపులు లోపలనుంచి చప్పుడవుతున్నట్లున్నాయి. అదిగో! అమ్మాఅనేపిలుపు. ఆగొంతుక రాంబాబుదిగాదూ! అంది కుంగిన గొంతుకతో - పొంగే బెంగతో, అదంతా _ భ్రాంతి వెఱ్ఱితల్లీ! యిప్పుడేగా మీరు యింట్లోంచివస్తా. ఇంతట్లోనేరాంబాబుఎక్కడినుంచి వస్తాడు? ధైర్యం తెచ్చుకోండి. ఆపదలందుధైర్యము ... అన్నారు కవులు. అని మళ్లీతెలుగు మేష్టారు చెప్పుతున్నారు. ఈ మాట తలుపులు చప్పుడైనట్లు అమ్మా అని పిలుస్తూన్నట్టు - ఆ గొంతుక రాంబాబుదే అయినట్లునాకూ వినిపించింది. ఏమండిమేష్టారూ నాకూ మా ఆవిడకు వినిపించినట్లే వినిపించిందండీ అన్నాను. మీచాదస్తం - చేయవలసినపని మరచిపోకండి. విలువగల టైమును వేస్టు చేయకండి అన్నారు తెలుగు మేష్టారు. పోనీ _ అనుమానం వదలిపోతుంది - ఆతాళం చెవియిలాయివ్వండి _ ఒకసారి యిల్లాంతాచూస్తాను అన్నాడు జవానుజగ్గయ్య. చటుక్కున తాళంతీసి _ జగయ్యతలుపులు తెరచేసరికి - అమ్మా - అమ్మా _ అంటూ ఏడుస్తూరాంబాబు గంతులేసుకుంటూవస్తున్నాడు. ఆనందం మెరిసేకళ్ళతో - ఆతురతతో _ రాంబాబూ! రా! నా బాబూ! రా! అంటూ ఆ తల్లి తనివితీరా ఆ ముద్దుబిడ్డను గట్టిగా ముద్దెట్టుకొని కౌగలించుకుంది.

అందరూ తెల్లబోయారు. వుయ్యాలలో బిడ్డను పెట్టుకుని వూరంతా వెతికినట్లుంది - అనేసామెత అందరి నోళ్ళలోను సందడి చేసింది. ఇదంతా మామూలంగా నే జరిగింది. తిన్నగా చూడకుండా కంగారు పెట్టారు - అని నావైపు చురచురా చూస్తూ పిల్లలతో యింట్లోకి పోయింది శ్రీమతి, మంచివారికి కష్టాలు వచ్చినా మబ్బులలాగ విడిపోతాయండీ! అంటూ మా ఆవిడను పలకరించి - నా దగ్గఱ శలవుతీసుకొని జవాను జగ్గయ్య చక్కాపోయాడు. పోనీలెండి_ తేచిన వేళ మంచిది! అని మిగిలినవాళ్ళు ధైర్యంగా యిళ్లకు వెళ్లారు.

ఔరా! శ్రావణమంగళవారం _ ఎంతపని చేసింది! పిల్లసైకిలుకింద పడటం! రాంబాబు యిలా చేయడం! మావాడు ఫ్రాన్కు బద్దలుకొట్టడం! వంటింటిని కుక్కకి అప్పచెప్పడం - అప్పలమ్మని సర్వేపేడుతో బాదడం! చాలా బాగుందికదూ! అని మా శ్రీమతి, పొరుగింటి వనజాక్షమ్మగారితో చెప్పుతూంది. దేవతల మొక్కుల్ని మాత్రం తీర్చుకో - ఆపద మొక్కులూ - సంపదమరుపులూ! అంటూరంది!

మా ఆవిడకున్న చాదస్తం - భక్తి ఎవరికీవుండవు. అక్షరాలా ఆర్యాపురం సత్యనారాయణస్వామి కోవిలకు యిప్పటికీ ప్రతిఆదివారంనాడూ పోయి కొబ్బరికాయకొడుతుంది. ప్రతి యేటా తిరుపతికి బ్రహ్మోత్సవసమయంలో వెళ్లాలని తీర్మానించుకొని మొన్ననే మొదటి మొక్కుబడి యాత్ర ముగించాం.

గ్రరున తిరిగి మళ్లీ శ్రావణమాసం వచ్చింది. పేరంటానికి పోను బాబూ యింక _ అని మా శ్రీమతి శపథం పట్టింది _ నిరుటి శ్రావణమాస కథని తలుచుకొని! పేరంటాళ్ళంతా _ ఏమండీ మీరు పేరంటానికి రారేం! సరదాలేదా' అని అంటూంటే _ రాంబాబూ అంటుంది వెంటనే కంగారుగా యిప్పటికీ!

—o—

అతిత్వరలో
అవతరిస్తున్నది

దేవదత్తం

తెలుగు వారపత్రిక
చిత్తూరు

శాశ్వతచందా రు. 116/-లు
సంవత్సరచందా రు. 10/-లు
6 మాసములచందా రు. 5/లు
విడిప్రతి 20 న. పై

ఆంధ్ర సారస్వతంలో సర్వాంగ సుందరముగా వెలువడనున్న వారపత్రిక. మనోహరములైన కథానికలతో, మధురగేయ స్రవంతులతో, మహోజ్వలములైన వ్యాసపరంపరలతో, నవ్యభావనాతరంగముల డోలికలలో పాఠకుల నుర్రూతలూగించనున్న యీపత్రికలో స్త్రీలకు, స్త్రీలసమస్యలకు కొన్ని పేజీలు ప్రత్యేకించబడుతవి. ఆదరాభిమానములతో చందాదారులుగా చేరండి!

ఏజంట్లు వెంటనే షరతులకు,
వివరములకు వ్రాయండి!

కె. సభా
మేనేజింగ్ ఎడిటరు